క్లుప్తంగా

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): సేవా కార్యక్రమాలు తృప్తినిస్తాయని ఎంఈఓ డీ రవీంద్ర అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం గుమ్మడిదుర్రు గ్రామానికి చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ గూడూరు శ్రీనివాసరావు సౌజన్యంతో విద్యార్థులకు నోట్‌బుక్స్, టైలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా చదివి భవిష్యత్తులో ఉన్నతి సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శెట్టిపోగు రాము, గ్రామపెద్దలు అత్తలూరి అచ్యుతరావు, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జేఆర్ కర్మాగారంలో తనిఖీలు



జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు టోల్‌ప్లాజా సమీపంలోని కొంగర మల్లయ్య గట్టు వద్ద నున్న జేఆర్ ఎకో ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారంపై శనివారం ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన కర్మాగారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కర్మాగారంలో వేస్ట్ మెటీరియల్‌ను తీసుకువచ్చి సిమెంట్ కర్మాగారాలకు వినియోగించే మెటీరియల్ తయారు చేస్తుంటారన్నారు. కర్మాగారంలోని కొన్ని లోపాలను గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలోని కర్మాగారాలు నిబంధనలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా ఆటోనగర్ ఇండస్ట్రీస్‌లో కొన్ని కర్మాగారాలు పర్యావరణానికి హాని కలిగించేలా ఉన్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని అటువంటివి ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీకి వస్తువులు బహూకరణ



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–2కు శనివారం గ్రామానికే చెందిన కొత్తగుండ్ల వెంకటేశ్వరరావు, వరలక్ష్మి దంపతులు పిల్లలకు అవసరమైన 15 బాక్స్‌లు, పాలు తాగేందుకు అవసరమైన కప్పులు, గిన్నెలు వేసుకునే స్టాండ్, చాక్లెట్లు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శైలజ, అంగన్‌వాడీ కార్యకర్త ధనలక్ష్మి, సచివాలయ సిబ్బంది, పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కంచికచర్ల: మండలంలోని పెండ్యాల జెడ్పీ హైస్కూల్‌లో శనివారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. నవజీవన్ బాలభవన్ సీఎస్ఎస్ ఏరియా కోఆర్డినేటర్ కొనకాల జగన్ పాల్గొని సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై విజయవాడకు చెందిన డాన్‌బాస్కో నవజీవన బాలభవన్ స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధి వేముల అనిత అవగాహన కల్పించారు. హెచ్‌ఎం హేమ మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం



నందిగామ రూరల్: విద్యార్థినులు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని శక్తి టీం ఏఎస్ఐ హనుమయ్య పేర్కొన్నారు. ఏసీపీ తిలక్, సీఐ వైవీఎల్ నాయుడు, ఎస్ఐ అభిమన్యుల ఆధ్వర్యంలో మండలంలోని అనాసాగరం, ఐతవరం గ్రామాల్లోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు శనివారం శక్తి యాప్, మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్ తదితర అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.



చిల్లకల్లు వసతి గృహంలో నేలపై చెక్కలు వేసుకుని పడుకున్న విద్యార్థులు



జగ్గయ్యపేట పట్టణంలో బురద, పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉన్న ఇంటిగ్రిటీ బాలికల హాస్టల్



నందిగామ పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్ల తలుపులకు కట్టిన తాళ్లు

వసతి గృహాలు.. సమస్యలకు నిలయాలు

- పెచ్చులూడుతున్న శ్లాబ్.. బీటలు వారిన గదులు
- తలుపులు లేని మరుగుదొడ్లు
- అరకొర వసతులతో ప్రభుత్వ వసతి గృహాలు

కంచికచర్ల, నందిగామ టౌన్, నందిగామ రూరల్, వీరులపాడు: నందిగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సాంఘిక సంక్షేమ, బాలుర, బాలికలు బీసీ సంక్షేమశాఖ మొత్తం 13 వసతి గృహాలున్నాయి. వాటిలో కంచికచర్లలో రెండు ఎస్సీ, రెండు బీసీ హాస్టళ్లు ఉన్నాయి. కంచికచర్ల ఎస్సీ హాస్టల్‌ను గత ప్రభుత్వంలో నాడు – నేడు పథకంలో భాగంగా అభివృద్ధి చేశారు. పరిటాలలో బీసీ విద్యార్థుల హాజరు మాత్రం 53. అయితే ఉండేది 24మంది మాత్రమే. అదేవిధంగా మండలంలోని పెండ్యాల బీసీ హాస్టల్‌లో 28మంది మాత్రమే ఉన్నారు. చందర్లపాడు ఎస్సీ హాస్టల్‌లో అరకొర వసతులు ఉన్నాయని విద్యార్థులు చెబుతున్నారు.



అల్లూరు గ్రామంలో మూసివేసిన సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం

నందిగామ పట్టణంలో..

పట్టణంలో ఐదు వసతి గృహాలుండగా నందిగామ మండలంలో ఒకటి, చందర్లపాడు మండలంలో రెండు వసతి గృహాలున్నాయి. పట్టణంలో ఎస్సీ బాలుర, బీసీ బాలుర, సాంఘిక సంక్షేమ బాలుర, గురుకుల పాఠశాల, బాలికల వసతి గృహం ఉండగా మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో బీసీ బాలుర వసతి గృహం ఉంది. చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో గురుకుల పాఠశాల వసతి గృహం, చందర్లపాడు గ్రామంలో బీసీ, ఎస్సీ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.



నందిగామ పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహం గదుల్లో బీటలు వారిన గోడలు



పెనుగంచిప్రోలు బీసీ హాస్టల్‌లో నేలమీద ఇరుకు స్థలంలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

మెనూ పాటించడం లేదు

పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలోని మరుగుదొడ్ల భవనం శ్లాబ్ పెచ్చులూడి మీద పడుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. అంతేకాకుండా మరుగుదొడ్లకు తలుపులు ఊడిపోతుండటంతో వినియోగించుకునేందుకు వీలు లేకుండా ఉన్నాయి. అలాగే విద్యార్థుల గదుల్లో గోడలు బీటలు వారి వర్షాలు పడితే చెమ్మ దిగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో మెనూ ప్రకారం భోజనం అందించడం లేదు. ఈ విషయాన్ని వార్డెన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

వీరులపాడు మండలంలో..

మండలంలోని వీరులపాడు గ్రామంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహం, జుజ్జూరు గ్రామంలోని బీసీ బాలుర సంక్షేమ వసతి గృహం, అల్లూరు గ్రామంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం ఉన్నాయి. కాగా జుజ్జూరు, అల్లూరు గ్రామాల్లోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలను అధికారులు మూసేశారు. జుజ్జూరు గ్రామంలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో తాగునీరు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. దోమలతో రాత్రులు నిద్రపోయే పరిస్థితి లేదని విద్యార్థులు వాపోతున్నారు. అదేవిధంగా అల్లూరులోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో సరైన వసతులు లేక విద్యార్థులను వసతి గృహాలకు పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపలేదు. దీంతో అధికారులు ఆ వసతి గృహాన్ని మూసివేశారు. అలాగే వీరులపాడు గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో మూడు నుంచి తొమ్మిదవ తరగతి వరకు 48 మంది విద్యార్థులు వసతి గృహంలో ఉండి విద్యనభ్యసిస్తున్నారు. వసతి గృహంలో గదులు, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. ప్రహరీ లేకపోవడంతో చుట్టు పక్కల పొలాల్లో నుంచి విష సర్పాలు వసతి గృహంలోకి వస్తున్నాయని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.

జగ్గయ్యపేట నియోజకవర్గంలో..

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో మొత్తం 5 ప్రభుత్వ వసతి గృహాలు ఉన్నాయి. వాటిలో ఒకటి ఎస్టీ బాలుర ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల హాస్టల్, మరొకటి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టల్, మరొకటి ఇంటిగ్రిటీ బాలికల హాస్టల్, ఎస్సీ స్పెషల్ బాలుర హాస్టల్, కాలేజీ స్టూడెంట్స్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్ ఉన్నాయి. కాగా ఎస్టీ ట్రైబల్ వెల్ఫేర్ బాలుర గురుకులలో 172 మంది విద్యార్థులు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులలో 605 మంది, ఇంటిగ్రిటీ బాలికల హాస్టల్‌లో 210 మంది, ఎస్సీ స్పెషల్ బాలుర హాస్టల్‌లో 135 మంది, కాలేజ్ స్టూడెంట్స్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో 14 మంది విద్యార్థులు ఉన్నారు.



విద్యార్థులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న జుజ్జూరు సాంఘిక సంక్షేమ వసతి గృహంలోని బెడ్లు



పెనుగంచిప్రోలు బీసీ హాస్టల్‌లో చెదలు పట్టిన పైకప్పు దూలాలు

తాగడానికి బోరు నీరే దిక్కు

జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఉన్న మూడు మండలాలకు కలిపి జగ్గయ్యపేటలో ఇంటిగ్రిటీ బాలికల హాస్టల్ 20 ఏళ్ల క్రితం నిర్మించారు. ఇందులో మున్సిపాలిటీ నుంచి పైపు లైన్ లేకపోవడంతో మున్సిపల్ వాటర్ సదుపాయం లేదు. దీంతో బాలికలు బోరు నీటినే తాగుతున్నారు. బాలికలకు ఇప్పటి వరకు దుప్పట్లు ఇవ్వలేదు. హాస్టల్ ఆవరణ అంతా పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి వర్షం వస్తే బురదమయంగా ఉంటుంది.

- ఎస్సీ స్పెషల్ బాలుర హాస్టల్‌లో ఈ ఏడాది దుప్పట్లు ఇంత వరకు ఇవ్వలేదు. పాతవే సర్దుబాటు చేసుకుంటున్నామని విద్యార్థులు అంటున్నారు.
- కాలేజ్ స్టూడెంట్స్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. పక్కన ఉన్న ఎస్సీ స్పెషల్ హాస్టల్ నుంచి రోజు క్యాన్‌లో వంటి మనిషి నీరు తీసుకువస్తున్నాడు.

చిల్లకల్లు బీసీ వసతి గృహంలో..

మండలంలోని చిల్లకల్లు బీసీ వసతి గృహంలో 20 మంది విద్యార్థులు ఉన్నారు. కిటికీలకు మెస్‌లు లేకపోవడంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. బెడ్‌లు కూడా లేకపోవడంతో నేలపైనే పడుకుంటున్నారు. వసతి గృహం ప్రహరీ కొన్ని రోజుల క్రితం కూలిపోవడంతో లోపలకు విష పురుగులు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

అద్దె భవనంలో అవస్థలు

పెనుగంచిప్రోలులో బీసీ విద్యార్థుల వసతి గృహం అద్దె భవనంలో చాలీచాలని వసతులతో కునారిల్లుతోంది. మొత్తం 60 మంది విద్యార్థులకు 4 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. పెంకుటిల్లు పైకప్పు దూలాలు చెదలు పట్టి ఉన్నాయి. వసతి గృహ వెల్ఫేర్ ఆఫీసర్ స్థానికంగా ఉండక రోజూ తిరువూరు నుంచి వస్తారని విద్యార్థులు చెబుతున్నారు. అలాగే మండల కేంద్రం వత్సవాయిలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల హాస్టల్ పొలాల మధ్య ఉండటంతో ఇక్కడ పాములు సంచరిస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. పాఠశాలలో మొత్తం 240 మంది విద్యార్థులకు గానూ 220 మంది ఉన్నారు. విద్యార్థులు ఆడుకునేందుకు సరైన క్రీడా స్థలం కూడా లేదు.

హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం



కార్యకర్తలతో కలిసి క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న తన్నీరు, నాయకులు



తిరుమలగిరిలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు

కాకరవాయి/వేములనర్వ(వత్సవాయి): ప్రజలకు మాయమాటలు చెప్పి ఇచ్చిన హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కాకరవాయి, వేములనర్వ గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన అబద్ధాల హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేసి మోసపోయారని తెలిపారు. అమలు సాధ్యం కానీ హామీలను గుప్పించిన చంద్రబాబుకు ప్రజలకు సరైన గుణపాఠం చెబుతారన్నారు. అనంతరం కాకరవాయి పార్టీ గ్రామ అధ్యక్షుడిగా రేళ్ల శివరామకృష్ణని ఎంపిక చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుత్తా శంకరరావు, నాయకులు బత్తుల రామారావు, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, రూప్లానాయక్, కొట్టె నగేష్, మెండెం రామారావు, లేళ్ల నాగేంద్రరెడ్డి, బొడ్డు రవి, బత్తినేని శ్రీనివాసరావు, ఏపూరి నరేంద్ర, కొనకంచి సురేష్‌బాబు, ఏపూరి వెంకటేశ్వర్లు, కలకఅబ్బయ్య, రేళ్ల గంగయ్య, వేముల శేషగిరి, పెద్దకృష్ణ, చిన్నరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను దగా చేస్తున్న ప్రభుత్వం

జగ్గయ్యపేట: ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలను నమ్మి రాష్ట్ర ప్రజలు మోసపోయారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బూడిద నరసింహారావు పేర్కొన్నారు. మండలంలోని తిరుమలగిరి గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ గ్రామ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి నేతలు విస్మరించారన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కరిశ ఇజ్రాయిల్, మెట్టు ఏడుకొండలు, ఆశీర్వాదం, యాకోబు, సుశీల, శ్యామల పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా ప్రజలను దగా చేస్తోందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్ పేర్కొన్నారు. శనివారం జగ్గయ్యపేట పట్టణం చెరువుబజారులోని 16, 17వ వార్డుల్లో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి పాలనలో ప్రజలను ఎలా మోసం చేశారో పట్టణ ప్రజలకు క్యూఆర్ కోడ్ స్కానర్ ఆవిష్కరించి చంద్రబాబు మోసాలను వివరించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ హఫీజున్నీసా, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నర్సింహారెడ్డి, రాష్ట్ర చేనేత విభాగం అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు, రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శి నంబూరి రవి, నియోజకవర్గ ఎంప్లాయిస్ విభాగం అధ్యక్షుడు దర్శి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాణావత్ రాజు, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు షేక్ మున్నీహీరా, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మన్నె అప్పారావు, నాయకులు దేవరశెట్టి వీరాంజనేయులు, దారెల్లి రాజు, షేక్ ఖాదర్ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు

నందిగామ టౌన్: మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సత్యలక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్తును పాడు చేసుకోకుండా కష్టపడి చదువుకుని సమాజానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ముందుగా విద్యా విధానం, అందుతున్న వసతులు తదితర వివరాలను విద్యార్థులను, వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు అద్దంకి మణిబాబు, గుర్రాల వెంకటరత్నం, షేక్ ఆజాద్, షేక్ దాదాహుసేన్, యరగొర్ల రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేట మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఎస్సీ మహిళకే ఇవ్వాలి

సీపీఎం జిల్లా నేత శ్రీనివాస్



మాట్లాడుతున్న సీపీఎం నేత శ్రీనివాస్

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర హైకోర్టు తీర్పు ప్రకారం జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని ఎస్సీ మహిళకే ఇవ్వాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, జగ్గయ్యపేట పట్టణ, మండల కార్యదర్శి ఎస్.నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక డీవీఆర్ నగర్‌లోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని మొదట ఎస్సీ మహిళకు కేటాయించగా, స్థానిక ప్రజాప్రతినిధులు అడ్డదారిలో ఓసీ కేటగిరికి ఇవ్వాలని చూడటాన్ని సీపీఎం పార్టీ తప్పుపడుతుందన్నారు. జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని జగ్గయ్యపేట మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని ఎస్సీ మహిళకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు కోట కృష్ణ, మండల కమిటీ సభ్యులు షేక్ గౌస్‌మియా, కోట రవికుమార్, డి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ద్వారావతి ఫౌండేషన్ ప్రతినిధి బొక్కా సాల్మన్‌రాజు శనివారం తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

నందిగామ రూరల్: ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని కొణతమాత్మకూరు గ్రామంలో శనివారం సుపరిపాలన – తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ పథకాలు, పని తీరును వివరించారు. కార్యక్రమంలో నాయకులు జవ్వాజి భాస్కరరావు, మన్నేపల్లి వినయ్, నాగమల్లేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలను సద్వినియోగించుకోవాలి



అంబోజి స్పందనను సత్కరిస్తున్న తన్నీరు

జగ్గయ్యపేట అర్బన్: పేద, మధ్యతరగతి వర్గాలు ట్రిపుల్ ఐటీ ద్వారా ఉన్నత స్థానాలకు ఎదిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు సూచించారు. ఇటీవల ప్రకటించిన ట్రిపుల్ ఐటీ 2025–26 ప్రవేశ ఫలితాల్లో ఎన్‌సీసీ కోటాలో ఒంగోలు క్యాంపస్ ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన జగ్గయ్యపేట పట్టణానికి చెందిన విజ్ఞాన్ స్కూల్ విద్యార్థిని అంబోజి స్పందనను శనివారం విజ్ఞాన్ స్కూల్‌లో సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తన్నీరు నాగేశ్వరరావు స్పందనను మెమెంటో, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి, ప్రిన్సిపాల్ అలెక్స్ జోసఫ్, ఎన్‌సీసీ ఆఫీసర్ పి.శ్రీనివాసరెడ్డి, ఎన్‌సీసీ కేర్ టేకర్ గురవయ్య, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

డ్రెయినేజ్ ఏర్పాటు చేయాలని వినతి

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని కొత్తవెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి శ్రీధర్ హాస్పిటల్, వెంకటగిరి గుట్ట సందులోకి వెళ్లే రోడ్డుకు ఇరువైపుల డ్రెయిన్లు నిర్మించాలని ఆ ప్రాంతానికి చెందిన జియాలజిస్ట్ ధరణికోట వెంకటరమణ మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ రోడ్డుకు డ్రెయిన్ లేకపోవడంతో అనేక దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కావున రోడ్డుపై నీరు నిలువ ఉండకుండా డ్రెయిన్ నిర్మించాలని కోరారు.